
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.6
ANDHRAJYOTHY



సూర్యాపేట
3
బుధవారం 6 నవంబరు 2024



వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు కేవలం ఒక్కరోజే మిగిలి ఉంది. బుధవారం ఓట్ల నమోదుకు చివరి రోజు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండటంతో తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితాను రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబరు నెలాఖరున షెడ్యూల్‌ను విడుదల చేసింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ):

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు
నేడే ఆఖరు

- సెప్టెంబరు 30 నుంచి ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
- 5వ తేదీ సాయంత్రం వరకు 19,111ఓట్ల నమోదు
- 23న ముసాయిదా జాబితా
- డిసెంబరు 30న తుది జాబితా

సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. కాగా, మంగళవారం సాయంత్రం వరకు ఉపాధ్యాయ నియోజకవర్గంలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 19,111 ఓట్లు నమోదయ్యాయి. 6వ తేదీన చివరి రోజు కావడంతో ఓట్ల నమోదు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించి, దీనిపై అభ్యంతరాలను డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరిస్తారు. అదే నెల 25 వరకు అభ్యంతరాలు పరిశీలించి, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఇలా ఉంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో స్వీకరించారు. ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. గతంలో...

- మిగతా 4వ పేజీలో...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం జిల్లాలో ప్రారంభంకానుంది. అందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్వేతో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సమాచారం తెలియనుంది. దీని ఆధారంగా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు, ఉద్యోగ నోటిఫికేషన్లలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు చర్యలు చేపట్టనుంది.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట (కలెక్టరేట్)



సర్వేకు
సర్వం సిద్ధం

తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో అప్పటి సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేయించారు. అనంతరం పదేళ్ల తర్వాత మరోసారి సర్వే జరగనుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాలు ఈ సర్వే వివరాల ఆధారంగా అమలుకానున్నాయి. సర్వేలో ప్రజలువారి వివరాలను దాచిపెట్టకుండా ఎన్యూమరేటర్లకు చెప్పాల్సి ఉంటుంది. ఈ సర్వేను మొత్తం 15 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది.

2,063 మంది ఎన్యూమరేటర్లు

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న నివాసాలను గుర్తించి వాటికి ప్రత్యేకంగా స్టిక్కర్లు అంటించారు. బుధవారం నుంచి సంబంధిత నివాసాల్లో సర్వే చేయనున్నారు. జిల్లాలో 3.37లక్షల గృహాలు ఉన్నాయి. సర్వే కోసం 2,063 మంది ఎన్యూమరేటర్లు, 263 మంది సూపర్‌వైజర్లను నియమించారు. సర్వే నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కూడా పూర్తి చేశారు.

సర్వే కొనసాగనుందిలా

జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను నియమించింది. ప్రతీ 150 నివాసాలను ఒక ఎన్యూమరేటర్ సర్వే చేయాల్సి ఉంది. ఇలా 175 నివాసాలను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేశారు. ఒక్కో బ్లాక్‌కు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. అదే విధంగా సర్వేను పర్యవేక్షించేందుకు మండల ప్రత్యేకాధికారులను మండల నోడల్ ఆఫీసర్లుగా, జిల్లా నోడల్ ఆఫీసర్‌గా అదనపు కలెక్టర్‌ను నియమించారు.

అన్నీ విషయాలను చెప్పాలి

సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లకు ప్రజలు అన్ని వివరాలు చెప్పాలని అధికారులు కోరుతున్నారు. సుమారు 75 అంశాలతో కూడిన వివరాలను సర్వేలో ఎన్యూమరేటర్లు నమోదు చేస్తారు. కులం, ఆర్థిక, రాజకీయ నేపథ్యం, కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, ఉద్యోగ వివరాలతో పాటు మరికొన్ని వివరాలు సేకరించనున్నారు. ఒక్కో ఇంటిని సర్వే చేసేందుకు ఎన్యూమరేటర్లకు కనీసం

- మిగతా 6వ పేజీలో...

జిల్లాలో మందుల
కొరత లేదు

డీఎంహెచ్‌వో కోటా చలం

జిల్లాలోని పీహెచ్‌సీల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో కోటా చలం తెలిపారు. మందులకు కొరత ఏర్పడితే వెంటనే స్పందించి రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ వివరాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట టౌన్)



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీల్లో ఏ మందులు అందుబాటులో ఉన్నాయి? కుక్కకాటుకు గురైతే మందులు ఉన్నాయా?

డీఎంహెచ్‌వో: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. ఒక వేళ కొరత ఉన్నా వెంటనే గుర్తించి అందుబాటులో ఉంచుతున్నాం. కుక్కకాటుకు గురైతే అందించే మందులు అన్ని పీహెచ్‌సీలో ఉన్నాయి. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం పీహెచ్‌సీలను తనిఖీచేస్తున్నాం.

ఆం: పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలు ఎన్ని ఉన్నాయి?

డీఎంహెచ్‌వో: పీహెచ్‌సీల్లో మెడికల్ అధికారుల కొరత ఉంది. అదేవిధంగా స్టాఫ్‌నర్సుల ఖాళీలు ఉన్నాయి.కొరత ఉన్న చోట కాంట్రాక్టు పద్ధతిన ఖాళీలను భర్తీ చేస్తున్నాం. ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అర్హత ఉన్న వారిని తీసుకుంటున్నాం.

ఆం: లింగనిర్ధారణ చేయకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో: ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నాం. గతంలో లింగనిర్ధారణ చేసి గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్న ఆసుపత్రులను తనిఖీచేసి సీజ్ చేశాం. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆం: ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతున్నారు? వారికి అనుమతి ఉందా?

డీఎంహెచ్‌వో: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేయవచ్చు. మధ్యాహ్నం వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసిన అనంతరం ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేయవచ్చు. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు నేరుగా ప్రైవేట్ ఆసుపత్రులను నడపకూడదు.

ఆం: జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో ఇటీవల నవజాత శిశువులు ఎక్కువగా మృతిచెందారు కారణాలేంటి?

డీఎంహెచ్‌వో: ప్రభుత్వ ఆసుపత్రిల్లో నవజాత శిశువల మరణాలకు వివిధ కారణాలు ఉన్నాయి. మరణానికి గల కారణాలపై విచారణ చేస్తున్నాం.

ఆం: కొద్ది రోజులుగా జిల్లాలో జ్వరాలు పెరుగుతున్నాయి కదా?

డీఎంహెచ్‌వో: శీతాకాలం ప్రారంభంలో కొన్ని వ్యాధులు ప్రబలుతాయి. కాచిచల్లార్చిన తాగునీటిని తాగాలి. అంటువ్యాధులు, డయేరియా ప్రబలకుండా తినే పదార్థాలపై, గిన్నెలపై మూతలు పెట్టాలి. చేతులను నిత్యం శుభ్రంగా కడుక్కోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

న్యూస్ బాక్స్

ఉత్తీర్ణత శాతం పెంచాలి


డీఐఈవో భానునాయక్



సూర్యాపేట జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న డీఐఈవో భానునాయక్

భానుపురి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని డీఐఈవో భానునాయక్ అన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లో రాణించేలా అధ్యాపకులు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవరిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. 75శాతం హాజరు ఉండేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య, అధ్యాపకులు ఉన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



ఏవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రవాణా కార్మికులు

సూర్యాపేటఅర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రవాణా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రాంబాబు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఏవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని చెప్పారని, వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, గోపి, కేశరాజు, కృష్ణ, ఎర్రయ్య, ఉపేందర్‌గౌడ్, ఆనంద్, మల్లయ్య సోమయ్యగౌడ్, నగేష్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



మహాసభలో మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు

కోదాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు డిమాండ్‌చేశారు. మంగళవారం పట్టణంలోని వర్తక సంఘం భవన్‌లో జరిగిన పార్టీ పట్టణ 12వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారన్నారు. దేశంలో మతోన్మాద శక్తుల వల్ల మైనార్టీ మతాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ముందుగా మహాసభ ప్రారంభ సూచికగా సీపీఎం పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకురాలు కుక్కడపు నళిని ఆవిష్కరించారు. అంతకుముందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మల్లు స్వరాజ్యం, బుద్ధదేవ్ భట్టాచార్య, పెన్నా అనంతరామశర్మ, సాయిబాబా, ఉప్పల కాంతారెడ్డిలకు ఈ మహాసభలో సంతాపం తీర్మానం ప్రవేశపెట్టారు.

పట్టణ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్, కుక్కడపు నళిని అధ్యక్షతన జరిగిన మహాసభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపెల్లి సైదులు, పట్టణ కార్యదర్శి మిట్టగణుపుల ముత్యాలు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జుట్టుకొండ బసవయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లయ్య



లేబర్ కమిషనర్ జగదీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ (భవన నిర్మాణ కార్మిక సంఘం) జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి యల్కా సోమయ్యగౌడ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో లేబర్ కమిషనర్ జగదీష్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో ఏళ్ల తరబడి ఉంటున్న వెల్ఫేర్ బోర్డు పెండింగ్ క్లైంలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో సభ్యులు కరిమల శేఖర్, మల్లెపాక నగేష్, ఒగ్గు సైదులు, ప్రభాకర్, అలీ, సోమయ్య, అబ్బాస్, లింగయ్య, మల్లయ్య, ఉపేందర్, గోపికృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా మట్టపల్లివాసుడి కల్యాణం

మఠంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయరీతిలో ఆర్జిత కైంకర్యాలు కొనసాగాయి. కల్యాణమూర్తులను పరిణయ వేదికపై అధిష్ఠింపజేసి పుణ్యాహవాచనం చేశారు. మాంగల్యధారణ, యజ్ఞోపవీత ధారణలు అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయచార్యులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

- భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నాగుల చవితిని జిల్లా వ్యాప్తంగా భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద పాలు సమర్పించి మొక్కు చెల్లించి చల్లగా చూడాలని వేడుకున్నారు.

సమస్యల్లేకుండా చూడాలి

న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీవాణి




భోజనాన్ని పరీక్ష చేస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి

సూర్యాపేటలీగల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ఎప్పటికప్పుడు సమస్యల్లేకుండా చూడాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీవాణి అన్నారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు.

కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను రుచిచూసి ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు చేశారు. ఆమెవెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించాలి

భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



భావన రుషి ఆలయ ప్రతిష్ఠ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్

మేళ్లచెర్వు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించుకోవాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ అన్నారు. మండలకేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయ సహిత భద్రావతి, భావనా రుషి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 18న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రంగారావు, సాయికుమార్, రాజు, నర్సింహారావు, కొండల్, గణేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశసంపదను నిర్వీర్యం చేస్తున్న
కేంద్ర ప్రభుత్వం

- మునుగోడు మాజీ శాసనసభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

సూర్యాపేటఅర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశసంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మిక చట్టాలను కుదిస్తూ కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్ తీసుకొస్తుందన్నారు. డిసెంబరు 26వ తేదీ వరకు పార్టీ ప్రజాసంఘాల సభ్యత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డిసెంబరు 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే పార్టీ శతవార్షిక వేడుకల బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు గన్నా చంద్రశేఖర్, యల్లంల యాదగిరి, రాములు, ధనుంజయనాయుడు, శ్రీనివాస్, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, లతీఫ్, మల్లీశ్వరి, కోటమ్మ, పాల్గొన్నారు.

పశుగణన నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం

డాక్టర్ శ్రీనివాసరావు

భానుపురి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పశుగణన ముమ్మరంగా కొనసాగుతోందని, నాలుగు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సూర్యాపేటలో మాట్లాడుతూ 40 మంది సూపర్‌వైజర్లు, 170 మంది ఎన్యూమరేటర్ల ద్వారా పశుగణన చేపడుతున్నామన్నారు. 16 జాతుల లెక్క పశుగణనలో వస్తోందన్నారు. పాతర్లపహాడ్, దూపాడులో కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ప్రారంభించామన్నారు. 20రోజుల నుంచి గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం సాగుతోందన్నారు.

నీరుండీ.. ఎండుతున్న జీవితాలు

చేపలవి, మత్స్యకార్మికులవి నీటితోనే ముడిపడిన జీవితాలు. నీరుంటేనే మనుగడ. కానీ నాగార్జునసాగర్‌లో నిండుగా నీరుంటే నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీ మత్స్యకార్మికులు ఒక్కపూట తినాల్సిందే. ఇక్కడి మత్స్యకారులు కృష్ణా పరివాహక ప్రాంతంలో చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలకు కృష్ణా పరివాహకంలో చేపల వేట సాగడం లేదు. దీనికి తోడు పర్యాటకుల రాక తగ్గి పూటగడవడమే భారంగా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరుండీ తమ జీవితాలు ఎండిపోతున్నాయంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-నేరేడుగొమ్ము)



వైజాగ్‌కాలనీలో చేపలవేటలేక నిరుపయోగంగా ఉన్న బోట్లు

● పర్యాటకులు లేక బోసిపోయిన వైజాగ్‌కాలనీ ● చేపల వేట లేక ఇబ్బందుల్లో మత్స్యకార్మిక కుటుంబాలు

నదీ తీర ప్రాంతాల్లో వైజాగ్‌కాలనీకి వెళ్లేందుకే ఎక్కువగా పర్యాటకులు ఆసక్తి చూపిస్తుంటారు. స్థానికంగా బోటింగ్‌తో పాటు అక్కడ దొరికే చేపల వంటకాలు కూడా పర్యాటకుల నోళ్లను ఊవ్విళ్లూరిస్తుంటాయి. సాయంత్రం వేళ నదీతీరంలో చేపలు తింటూ సరదాగా గడుపుతుంటారు. ఈ క్రమంలో నిత్యం పర్యాటకుల తాకిడితో ఉండే వైజాగ్‌కాలనీ ఇప్పుడు బోసిపోయింది. నీటినిల్వతో బోటింగ్‌ను నిలిపివేశారు.అదేసమయంలో పర్యాటకులు సరదాగా గడిపేందుకు స్థలం లేకుండాపోయింది. పర్యాటకులు పర్యటనలకు రావద్దని పోలీస్‌శాఖ కూడా హెచ్చరికలు జారీ చేయడంతో అటు ఉపాధిగా ఉన్న చేపల వేట లేక, పర్యాటకుల రాక తగ్గి మత్స్యకార్మికులకు ఆదాయం పూర్తిగా పడిపోయిందని, పూటగడవటం కూడా కష్టంగా మారిందంటున్నారు.

ఉపాధి లేక వలసలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ పెరిగి చేపల వేట నిలిచింది. చేపలు వరద సమయంలో ఎదురుఈదుతూ వెళ్తుంటాయి. ఈ క్రమంలో వలకు చేపలు పడటం లేదు. ఒక్కో రోజు వలలో రెండు కిలోల చేపలు కూడా చిక్కడం లేదంటున్నారు మత్స్యకార్మికులు. గ్రామంలో 200 కుటుంబాలు చేపల వేటమీదే ఆధారపడి జీవిస్తుంటాయి. ఆగస్టు నుంచి సాగర్‌కు వరద మొదలైందని మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కుటుంబాలు ఉపాధి కోసం వలస వెళ్లాయంటున్నారు. నీటినిల్వ తగ్గే వరకు చేపలు లభ్యమయ్యే పరిస్థితి ఉండదని, అప్పటి వరకు కృష్ణా నదిలో పర్యాటకులను తిప్పడానికి బోట్లకు అనుమతి ఇచ్చి ఆదుకోవాలని మత్స్యకార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.



● పర్యాటకులను తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇవ్వాలి



కృష్ణా పరివాహక ప్రాంతంలో పర్యాటకులు తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇవ్వాలి. బోట్లకు అనుమతి ఇస్తే పర్యాటకుల రద్దీ పెరుగుతుంది. దీంతో తమకు జీవనోపాధి కలుగుతుంది. చేపలవేట లేక ఇబ్బందుల్లో ఉన్నాం.

చేపల నిరీక్ష, వైజాగ్‌కాలనీ

● పూటగడవడమే భారమైంది



కృష్ణానదిలో నీటిప్రవాహం పెరిగి వలలు వేసినా చేపలు ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయి.రెండు, మూడు కిలోలు కూడా పడడంలేదు. దీంతో పూటగడవడం భారమైంది. పర్యాటకులను తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇస్తే ఉపాధి దొరుకుతుంది.

కోట జగ్గు, మత్స్యకారుడు, వైజాగ్‌కాలనీ.



వాడపల్లి గ్రామంలో మరపడవలు కలిగిన 11 మందితో పాటు మరో 30మంది చేపల వేట సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ వృత్తి తప్ప వారికి మరే ఆదాయ మార్గం లేదు. వలలో చిక్కే చేపల విక్రయాలతోనే వారికి భుక్తి. రాత్రీ పగలు వల వేసినా నీటి ప్రవాహ పెరిగి చేపలు పడటంలేదని మత్స్యకార్మికులు వాపోతున్నారు. వలలో చిక్కే ప్రతీ చేపకు డిమాండ్ ఏమీ ఉండదంటున్నారు. వాడపల్లి సమీపంలో ఎక్కువగా రవ్వ, బొమ్మిడాయి, బొచ్చ, చందమామ, బురదమట్టలు దొరుకుతాయని, ఎక్కువగా డిమాండ్ ఉండే కొర్రమీను తక్కువగా చిక్కుతుందని మత్స్య కార్మికులు తెలిపారు. చేపలను స్థానికంగా, మిర్యాలగూడ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. వచ్చే ఆదాయంతో కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. సాగర్ గేట్లు ఎత్తి భారీ వరద వచ్చే సమయంలో కొన్నిరోజుల పాటు చేపలవేట ఉండదంటున్నారు.ఆ సమయంలో కుటుంబాలను వెళ్లదీయడం ఇబ్బందిగా ఉందంటున్నారు. ప్రభుత్వం తమను సబ్సిడీపై ఆధునిక పడవలను అందజేయడంతో పాటు చేపలను హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను అందించాలంటున్నారు.

కృష్ణమ్మ ఒడిలో పెరిగిన బిడ్డలు వాళ్లు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా, మూసీ సంగమ ప్రాంతంలో చేపలు వేటకు వెళ్తూ జీవిస్తుంటారు. అదే వారి వృత్తి. వరదసమయాల్లో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. నిత్యం కృష్ణా నదిలో ఉండే ఈ మత్స్యకారులు చేపలు పడుతూ జీవనోపాధి పొందడంతో పాటు నీటిలో కొట్టుకుపోయే ఎంతో మంది జీవితాలను కాపాడారు. ఇంత చేస్తున్నా వారి జీవితాల్లో మార్పు రావడం లేదు.

(ఆంధ్రజ్యోతి-దామరచర్ల)

రక్షణలో ముందు వరుస

వాడపల్లిలో కొలువైన మీనాక్షి అగస్త్యేశ్వర-లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ కృష్ణాతీరంలో చేపలు పట్టేందుకు రాత్రీ పగలు తేడాలేకుండా సమయం కుదిరినప్పుడు మత్స్యకార్మికులు వెళ్తుంటారు. దీంతో వారు లేకుండా సంగమ ప్రాంతం కనిపించదు. సంగమ ప్రాంతంకావడంతో శుభ,అశుభకార్యాల కోసం ఇక్కడికి ప్రజలు తరలివస్తుంటారు. పండుగలు, పర్వదినాల్లో భక్తుల రాక మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో నదీ ప్రవాహంలో కొట్టుకపోవడం, నీటిలోపడితే రక్షించడంలో ముందుంటారు. పుష్కరాలతో పాటు వివిధ పర్వదినాల్లో నదీ స్నానానికి వచ్చే భక్తులను ప్రమాదాల బారి నుంచి కాపాడుతున్నారు. ఇప్పటివరకు 100మందికి పైగానే రక్షించారు. అదేస్థాయిలో నీటి మునిగి చనిపోయిన మృతదేహాలను సైతం వెతికి తీశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గత 40 ఏళ్లుగా కృష్ణానదిలో చేపలను పడుతూ జీవనం సాగిస్తున్నా. ప్రమాద సమయంలో ఇప్పటివరకు ఎంతో మందిని రక్షించాం. వరదల సమయంలో చేపల వేటకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఆదాయం లేక జీవితం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం మత్స్యకార్మిక కుటుంబాలను ఆదుకోవాలి.

ఎస్‌కే ఇక్బాల్, మత్స్యకార్మికుడు, వాడపల్లి

ఓట్ల నమోదుకు నేడే ఆఖరు

(3వ పేజీ తరువాయి)

ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు సైతం మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈసారి జరిగే ఎన్నికలకు ఓటర్ల సంఖ్య పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని మేనేజ్‌మెంట్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల ఉపాధ్యాయులకు సైతం ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు ఓట్ల నమోదు కోసం అవగాహనతో పాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. దీంతో పాటు పలువురు అభ్యర్థులు ప్రచారం కూడా ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20,888 ఓట్లు నమోదయ్యాయి. ఇంకా ఓట్ల నమోదుకు మరో రోజు గడువు ఉన్నందున్న వీటి సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మంగళవారం నాటికి
మూడు ఉమ్మడి జిల్లాలో ఓట్ల నమోదు ఇలా...

జిల్లా	మండలాలు	వచ్చిన దరఖాస్తులు
సిద్ధిపేట	04	128
నల్లగొండ	33	3,886
సూర్యాపేట	23	2201
యాదాద్రి	17	874
జనగాం	12	645
మహబూబాబాద్	18	988
వరంగల్	13	1818
హనుమకొండ	11	3664
భూపాలపల్లి	07	196
భద్రాద్రి	23	1496
ఖమ్మం	21	2873
ములుగు	09	342
మొత్తం	191	19,111

8న టెండర్ కం బహిరంగ వేలం

కనగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం ఈనెల 8 తేదీన వివిధ వస్తువుల విక్రయ హక్కుల కల్పించేందుకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఏడాది కాలానికి వివిధవస్తువులకు సంబంధించి వేలం జరుగుతుందని ఆసక్తి గల వారు ఎల్లమ్మ ఆలయం పేరిట ఏదేని జాతీయ బ్యాంకులో డీడీ తీసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. టెండర్‌కు సకాలంలో హాజరుకావాలన్నారు. అదేవిధంగా బుధవారం హుండీకానుకలు లెక్కిస్తున్నట్లు ఈవో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేసి పాలు పోశారు. నల్లగొండలోని పానగల్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నాగదేవత పుట్ట వద్ద మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టలో పాలు పోశారు. యాదాద్రి జిల్లా , సూర్యాపేట జిల్లాలోని పలు ఆలయాల్లోనూ భక్తుల సందడి కనిపించింది.

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)



సూర్యాపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



నల్లగొండలో నాగదేవత విగ్రహానికి పాలుపోస్తున్న మహిళలు





సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరలో నాగదేవతల విగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు, నల్లగొండ జిల్లా వేములపల్లిలో నాగదేవత విగ్రహంపై పాలుపోస్తున్న భక్తులు

గుట్టను తవ్వి.. దారిని చేసి

● సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర కోసం చకచకా ఏర్పాట్లు

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఈ నెల 8వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సీఎం పాదయాత్ర నేపథ్యంలో మూసీ పరివాహకంలోని సంగెం పరిధిలోని గుట్టను తవ్వి మట్టిని తరలించారు. మూసీ ప్రాంతానికి ఇరువైపులా మట్టిని పోసి చదునుచేశారు. పాదయాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.



సీఎం పాదయాత్ర కోసం సంగెం సమీపంలోని గుట్ట వద్ద దారి కోసం ఎక్స్‌కవేటర్‌తో కొనసాగుతున్న తవ్వకాలు





కనగల్‌లో కొనసాగుతున్న బాలుర విభాగంలో పోటీ

ముగిసిన ఉమ్మడి జిల్లా ఖోఖో సెలక్షన్ పోటీలు

● 24 మంది బాల, బాలికల ఎంపిక

కనగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-19 బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలు ముగిశాయి. బాలుర విభాగంలో 120 మంది, బాలికల విభాగంలో 130 మంది పాల్గొనగా, 24 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 8, 9, 10 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్ల నుంచి పాల్గొననున్నారు. అంతకుముందు పోటీలను డీఐఈవో దస్రూనాయక్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మ, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ థామస్, మమత, పీడీలు నర్సిరెడ్డి, విజయ్, పాఠశాల ఉపాధ్యాయులు రాజు, భద్రయ్య, జగదీష్, అక్కినేపల్లి శ్రీనివాస్, రాజేందర్, సుమధుర గ్రూప్స్ ప్రతినిధి నర్సింగ్ మురళీగౌడ్, బొడ్డుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దస్రూనాయక్

రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా కిరణ్‌ప్రసాద్



నల్లగొండ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన తడక కిరణ్‌ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలోని రాధాకృష్ణా స్టేడియంలో నిర్వహించే 14వ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 31 హాకీ జట్లు పాల్గొంటున్నాయి. రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా కిరణ్‌ప్రసాద్ ఉండనున్నారు. ప్రస్తుతం ఆయన ప్రస్తుతం ఇండియన్ ఆర్మీ హాకీ టీం కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మాసాయిపేట విద్యార్థిని

యాదగిరిగుట్టరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట విద్యార్థిని వల్లపు హిందు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా జట్టు తరుపున హిందు ఈ నెల 7వ తేదీ నుంచి తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో నిర్వహించే అండర్-14 పోటీల్లో పాల్గొననున్నట్లు మాసాయిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం మల్లికార్జున్ తెలిపారు. ఆయనతో పాటు పీఈటీ చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం హిందును అభినందించింది.



విద్యార్థిని హిందును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎంజీయూ రిజిస్ట్రార్‌గా అల్వాల రవి



నూతన రిజిస్ట్రార్ అల్వాల రవిని అభినందిస్తున్న అధికారులు, ఉద్యోగులు

నల్లగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు అల్వాల రవిని నియమిస్తూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రతీ అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి అంకితభావంతో పనిచేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మొదటిసారిగా ఎంజీయూ అధ్యాపకుడికి అవకాశం రావడం ఎంతో సంతోషకరమని, సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న దృష్ట్యా మరింత ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన రిజిస్ట్రార్ అల్వాల రవిని, ప్రిన్సిపాళ్లు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

బోరింగ్‌తండాలో మద్యనిషేధంపై తీర్మానం



గ్రామంలో మద్యనిషేధం విధించుకుంటూ చేసిన తీర్మానాల కాపీలను చూపిస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎస్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన తండాలో మద్యం మహమ్మారి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తుందని, అందుకే తమ గ్రామాల్లో మద్యం నిషేధించాలని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో పల్లెలు ఒక్కొక్కటిగా ప్రతినబూనుతున్నాయి. మొన్నటి వరకు మండలంలోని మూడు గ్రామాల్లో మద్యం నిషేధం అమలుకు తీర్మానించగా మంగళవారం బోరింగ్‌తండాలో మద్యపాననిషేధం అమలుకు తీర్మానించారు. వివిధ సామాజిక, రాజకీయ వర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో సమావేశమయ్యారు. గ్రామంలో మద్యం దుకాణాలు మూసివేయాలని అఖిలపక్షాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇక నుంచి మద్యం విక్రయించడం, తాగడం చేయవద్దంటూ ప్రతిజ్ఞ చేశారు. బోరింగ్‌తండాలో మద్యం విక్రయించినా, తాగినా జరిమానా విధిస్తామని, ప్రతీ రాజకీయ పార్టీల కులసంఘాలు, యువజన సంఘాల నుంచి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించారు. గ్రామాల్లో మద్యనిషేధం చేసుకోవడం సంతోషకరమైన శాంతియుతంగా ఉద్యమాలు చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పరుచుకోవాలని సూచించారు. కిరాణాషాపులు మరే విధమైన ప్రాంతాల్లో గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుగులోతు గణేష్, చాంప్లా, కుమార్, సురేందర్, శ్రీనివాస్, శేఖర్, వీరన్న, ప్రేమ్‌కుమార్, నందు, పార్వతీ, పద్మ, బుజ్జి, చంద్రకళ, కల్పన, మంజుల పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె, నవంబరు 5: విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడు మద్యం మత్తులో పాఠశాలకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పాఠశాల ఆవరణలోనే నిద్రించాడు. సోమవారం సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని రాంపురంతండాలో ఈ ఘటన జరిగింది. గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సదరు ఉపాధ్యా యుడిపై మంగళవారం సస్పెన్షన్ వేటు పడింది. ఎంఈవో గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మామిళ్లగూడెం గ్రామానికి చెందిన నవిలే ఉపేందర్ రాంపురంతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భార్య మృతి చెందినప్పటి నుంచీ నిత్యం మద్యం మత్తులో పాఠశాలకు వస్తుండడంతో రెండేళ్ల క్రితం ఇదే తండావాసులు జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. అప్పుడు సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయుడు ఆరు నెలల క్రితం విధుల్లో చేరారు. సోమవారం కూడా మద్యం మత్తులో పాఠశాలకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పాఠశాల ఆవరణలోనే నిద్రించటంతో గ్రామస్థులు జిల్లా విద్యాశాఖ అధికారికి ఆ ఫొటోలను పంపించారు. విచారణ చేసిన ఉన్నతాధికారులు ఉపేందర్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం గ్రామస్థులు, విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

కోదాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కోదాడ మండల పరిధిలోని కూచిపూడితండాలో మంగళవారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ అనిల్ రెడ్డి మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తండాకు చెందిన తేజావత్ సాయిభగవాన్ (24) కోదాడ పట్టణంలోని ఓ పూల దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సుమారు 11గంటల సమయంలో తను పనిచేసే దుకాణం వద్దకు బాలాజీనగర్‌కు చెందిన పవన్, నందూలాల్, సిద్ధు, నవీన్, కూచిపూడితండాకు చెందిన సాయి, ఇంకా కొంతమంది వచ్చి పవన్ చెల్లెల్ని ప్రేమ పేరుతో వేధిస్తున్నావని ఆ విషయంలో మాట్లాడుదామని పిలిపించారని ఎస్‌ఐ తెలిపారు. సాయి భగవాన్, అతని స్నేహితుడు ప్రకాశ్ ఒకే బండిపై కోదాడలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే ఫైవారందరూ సాయి భగవాన్‌పై దాడి చేశారు. దీంతో సాయిభగవాన్ కూచిపూడితండాకు వచ్చి అవమానభారంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతనిని కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. సాయిభగవాన్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌పై వ్యక్తి దాడి


చికిత్స పొందుతున్న అసిస్టెంట్ లైన్‌మన్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌పై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ సంఘటన మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లిలో జరిగింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అసిస్టెంట్ లైన్‌మెన్ గుగులోతు వెంకటేష్ జగత్‌పల్లి గ్రామంలో మంగళవారం కరెంటు మీటర్ రీడింగ్ చేస్తున్నాడు. గ్రామంలోని బింగి ఈశ్వర్ ఇంటికి మీటర్ రీడింగ్ చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి ముందున్న కుక్క తనని కరవడానికి రాగా, తన వద్ద ఉన్న కటింగ్ ప్లేయర్‌తో కుక్కను కొట్టడంతో అది అరుస్తూ ఇంట్లోకి వెళ్లింది. తన కుక్కను కొట్టావని అయితే ఇంటి యజమాని ఈశ్వర్ ఆగ్రహంతో దాడి చేశాడని అసిస్టెంట్ లైన్‌మెన్ బోరున విలపించాడు. అంతేగాక తనను కులం పేరుతో దూషించాడని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తన సహచర సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.

మహిళ గొంతుకోసిన గుర్తుతెలియని వ్యక్తి

కోదాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మహిళపై దాడి చేసి గొంతు గోసి పరారయ్యాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో మంగళవారం జరిగింది. పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో నివాసంటున్న ఎస్. రేణుక ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి మహిళను గొంతుకోశారు. దీంతో ఆమె అరుపులు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి పరారయ్యాడు. గాయపడిన రేణుకను స్థానికులు నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్టు

మేళ్లచెర్వు, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రానికి ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా చేస్తూ 250 గ్రాముల గంజాయితో ఈ నెల 2వ తేదీన సింహాద్రి, నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మండల కేంద్రానికి చెందిన యామపంగు మహేష్, మంగలపల్లి సింహాద్రి, బుస్కా నరేష్‌లను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు కళేబరం

నాగారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్లిన కాడెద్దు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరుకు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో మంగళవారం జరిగింది. ఆకుల నాగయ్య వ్యవసాయ క్షేత్రంలో కాడెద్దులను మేపుతుండగా మేతకోసం వెళ్లిన కాడెద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఎద్దు విలువ సూమారు రూ.50 వేలు ఉంటుందని రైతు నాగయ్య తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన మస్క వెంకటయ్య(35) కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఊరు చివరన గల బత్తాయి తోటలో గల మామిడి చెట్టుకు ఉరి వేసుకొని విగతజీవిగా వేలాడూ ఉన్నాడు. మంగళవారం మధ్యాహ్నం బత్తాయి తోట యాజమాని తిలారి వెంకటమ్మ తోట వద్దకు వెళ్లింది. అక్కడ చెట్టుకు వేలాడూ వ్యక్తి కనిపించడంతో భయపడిన ఆమె వెంటనే గ్రామంలోకి పరుగెత్తుకు వచ్చి గ్రామస్థులకు విషయం చెప్పింది. వారు వెంటనే వెళ్లి చూసి గుడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటయ్య మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సెంట్రింగ్ పనికి వెళ్లి..

నల్లగొండ, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ పట్టణంలో నివాసముంటున్న పొనుగోటి నాగేశ్వర్‌రావ్(35) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నల్లగొండ పట్టణంలోని కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో షంషూనగర్‌లో నివాసం ఉంటున్నాడు. తిప్పర్తి డిప్యూటీ తహసీల్దార్ కొత్త ఇంట్లో పనిచేస్తూ కింద పడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. నాగేశ్వరరావు సోదరుడు వెంకటేశ్వరావ్ ఫిర్యాదు మేరరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెంచులకు ఏదీ చేయూత

స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు గడిచినా చెంచుకుల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావడం లేదు. ఇంకా సాంప్రదాయ వృత్తులే ఆదాయ వనరులుగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించి, వాటిని విక్రయించగా వచ్చిన ఆదాయంతోనే కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని చెంచులను నాలుగు దశాబ్దాల కిందటే గుర్తించి ప్రభుత్వం అరకొర సౌకర్యాలు కల్పించి చేతులు దులుపుకుంది. .

(ఆంధ్రజ్యోతి-డిండి)


గోనబోయినపల్లిలో ఒకే ఇంట్లో నివాసముంటున్న జెల్ల గురువయ్య కుటుంబం

నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్న చెంచులను గుర్తించి, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని 1986లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో మామిళ్లగడ్డ వద్ద అటవీ ప్రాంతానికి సమీపంలో జీవిస్తున్న 17చెంచు కుటుంబాలను గుర్తించింది. అటవీ ఉత్పత్తులతోనే కుటుంబాలను పోషించుకుంటున్న వారిని చేరదీసి డిండి మండలం గోనబోయినపల్లిలో పునరావాసం కల్పించింది. గ్రామంలోని సర్వే నెంబర్ 743, 745లోని వ్యవసాయ భూమిని ప్రతీ కుటుంబానికి 1.20 ఎకరాల చొప్పున కేటాయించింది. అయితే నీటి సౌకర్యం లేని ఈ భూమిని సాగు చేయలేక చెంచులు బీడుగా ఉంచారు. ఇదిలా ఉండగా భూములకు సంబంధించిన పట్టాలను మాత్రం వారి పేరు మీద చేయలేదు. కలెక్టర్ పేరు మీదనే పట్టాలను పంపిణీ చేసింది. అదేవిధంగా 1988లో 17 కుటుంబాలకు పక్కా ఇళ్లను నిర్మించి పంపిణీ చేసింది.

ఇతర ప్రాంతాలకు వలస

చెంచులు అటవీలో లభించే ఉత్పత్తులతోనే ఆదాయాన్ని పొందేవారు. కుందేళ్లను పట్టడం, రోకళ్లు తయారు చేయడం, కుంకుడుకాయలు సేకరించడం, నాగళ్లకు ఉపయోగించే కోలలు తయారు చేసి వాటిని సమీపంలోని గ్రామంలో విక్రయించి నిత్యావసరాలు కొనుగోలు చేసుకునేవారు. గోనబోయినపల్లిలో కేటాయించిన భూమికి నీటిసౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం ప్రారంభించారు. కొందరు చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామానికి కొందరు వలసలు పోగా మరికొందరు అక్కడక్కడ నివాసం ఉంటున్నారు. చెంచులలో ఒకరైన జెల్ల గురువయ్యకు ఆరుగురు కొడుకులు ఉన్నారు. అందులో నలుగురు వివాహాలు అయ్యాయి. కుటుంబం మొత్తం 20 మందికిపైగా ఉన్నారు. వీరంతా ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. ఇలా కుటుంబాల సంఖ్య పెరగడంతో ఇళ్ల సరిపోకపోవడం వంటి కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో వారికి కేటాయించిన ఇళ్ల శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని చెంచులు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా సాగులోకి భూములు

గత పదేళ్లలో కొన్ని సమయాల్లో వర్షాలు అధికంగా కురవడంతో గోనబోయినపల్లిలో కేటాయించిన భూమికి ఎత్తున ఉన్న కానుగచెరువు అలుగు పోస్తోంది. కానుగ చెరువు అలుగుపోసినప్పుడు మాత్రమే కాల్వకు నీరుచేరి పొలాలకు అందుతుంది. చెరువులో నీళ్ల తగ్గితే పంటచేలకు నీరందక ఎండిపోవాల్సిందేనని వారు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూములకు విద్యుత్ ఏర్పాటు చేసి బోరు బావులు తోడించాలని వారు కోరుతున్నారు. సాగు చేయని సమయంలో జీవనోపాధి కోసం చేపల వేట, కుంకుడుకాయల సేకరణ చేపడుతున్నారు. ఈ క్రమంలోనే గురువయ్య ఆయన భార్య నిరంజమ్మ, ఇద్దరు కుమారులు, కోడళ్లు నాలుగు నెలల పసికందును తీసుకొని చేపలవేటకు డిండి వాగులోకి వెళ్లి సెప్టెంబరు నెలలో నీటిలో చిక్కుకున్నారు.

అందని సంక్షేమ ఫలాలు

చెంచులకు కేటాయించిన వ్యవసాయ భూమి కలెక్టర్ పేరున నమోదై ఉంది. దీంతో ఇటీవలి ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న రైతు భరోసా, రైతు బీమా, వ్యవసాయ రుణాలు పొందలేకపోతున్నారు. కుటుంబాల సంఖ్య పెరిగినా ప్రభుత్వం పక్కా గృహాలు కల్పించలేదు. కొందరు శిథిలావస్థకు చేరిన గృహాలను మరమ్మతు చేసుకుని ఉంటుండగా, మరికొందరు కొందరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. గ్రామంలోనే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నా చెంచుల పిల్లల్లో ఎవరూ చదువుపై ఆసక్తి చూపడంలేదు. వారిని కుటుంబ సభ్యులు తమ వెంటే పనులకు తీసుకెళ్తున్నారు. 17 కుటుంబాలు ఉన్న చెంచులు ప్రస్తుతం 40 కుటుంబాలకు చేరగా వారి జనాభా 120కి పైగా ఉంది. అయినప్పటికీ వీరి కుటుంబాలలో 10వ తరగతి పూర్తిచేసినవారు ఒక్కరూ లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా వీరికి రేషన్‌కార్డులు జారీకాకపోవడంతో చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఇచ్చే బియ్యం కూడా అందడంలేదు. చెంచులు సరైన పౌష్టికాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్నారు.

ఇళ్లులేక అందరం ఒకే ఇంట్లో ఉంటున్నాం



నాకు ఆరుగురు కుమారులు, కోడళ్ల, మనవళ్లు, మనవరాళ్లతో కలిపి 20 మంది ఉన్నాం. అందరం చిన్నఇంట్లోనే ఉంటున్నాం. ప్రభుత్వం ఇళ్ల కట్టించి ఇవ్వాలి. రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదు. ● జెల్ల గురువయ్య.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	240	270
సూర్యాపేట	రూ.150	220	260
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.60
టీఎంసీలు	303.4310
ఎడమకాల్వకు నీటి విడుదల	5,018
కుడికాల్వకు	9,443
విద్యుత్ కేంద్రం ద్వారా	25,291
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	41,352 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.89 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	9,30 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.65 అడుగులు
టీఎంసీలు	4.11
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	738.46 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	887.95 క్యూసెక్కులు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

● పోలీసులు సకాలంలో గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగింత

నాగార్జునసాగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు రెండు గంటల్లోగా ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం తునికినూతుల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రమావత్ తిరుపతమ్మ(32) మంగళవారం భర్తతో గొడవ పడి నాగార్జునసాగర్‌కు వచ్చింది. నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ కొత్త బ్రిడ్జి వద్దకు వెళ్లి ఉంటుందనే అనుమానంతో భర్త లక్పతి వెంటనే నాగార్జునసాగర్‌కు వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం(జీపీఎస్) సాయంతో మహిళ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఆమె ఉన్న ప్రాంతాన్ని తెలుసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి, హోంగార్డులు సతీష్, రవికునాయక్ అక్కడికి వెళ్లి ఆమెకు నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి తన భార్యను కాపాడిన పోలీసులకు లక్పతి కృతజ్ఞతలు తెలిపాడు.

మాధవరంలో కారు బీభత్సం.. ఒకరు మృతి

మునగాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త నిద్రమత్తుతో కారు నడపడంతో బైక్, పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామశివారులో మంగళవారం జరిగింది. మాధవరం గ్రామానికి చెందిన నలగొండ పిచ్చమ్మ(48), ఆమె కుమారుడు నలగొండ నవీన్ (బీటెక్ విద్యార్థి) టీవీఎస్ బైక్‌పై పొలానికి మందు కొట్టేందుకు వెళ్తున్నారు. అదే క్రమంలో ఎల్లాల వెంకన్న, కుమారుడు సతీష్, మన్యం లింగయ్య నడుచుకుంటూ టీవీఎస్‌పై వెళ్తున్న వారితో మాట్లాడుకుంటూ రోడ్డు పక్కనుంచి వెళుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో టీవీఎస్, పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో టీవీఎస్‌పై ఉన్న నలగొండ పిచ్చమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108అంబులెన్స్‌లో సూర్యాపేటలోని ఏరియా ఆస్పతికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పిచ్చమ్మ చికిత్సపొందుతూ మృతిచెందింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు క్షేమంగా ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ చిట్యాల వరప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఒంటరితనం భరించలేక..

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంటరితనం భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాతకోటి సైదులు (55) ఆలగడప చేపల చెరువు వద్ద కాపలా కూలీగా పనిచేస్తున్నాడు. అడపాదడపా లక్ష్మీపురానికి వస్తుంటాడు. మంగళవారం ఉదయం గ్రామంలోని రామాలయం వద్ద పురుగుల మందు సేవిస్తూ ఉండడాన్ని గుర్తించిన స్థానికులు సైదులును నిలువరించారు. వెంటనే 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. సైదులు భార్య 20 సంవత్సరాల క్రితం చనిపోగా, చిన్న కుమారుడు మూడేళ్ల కిందట చనిపోయాడు.

ఒంటరితనంతో బాధప డుతూ మనస్తాపానికి గురై పురుగుమందు తాగినట్లు గ్రామస్థులు తెలిపారు. పెద్ద కుమారుడు యేలేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పొలానికి వెళుతూ నీటిలో మునిగి రైతు మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొలానికి బయలుదేరిన రైతు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడ్డోనితండాకు చెందిన నేనావత్ నరియానాయక్(52)కు గ్రామ శివారులోని మర్రిచెట్టు తండా (మైనంపల్లి వాగు పక్కన) వ్యవసాయ భూమి ఉంది. పొలం పనుల నిమిత్తం మంగళవారం ఉదయం ఇంటినుంచి బయలుదేరాడు. మర్రిచెట్టు తండా వైపు వెళ్లేవారు వాగు పక్కగా ఉన్న డొంక మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు మైనంపల్లి వాగు నిండి డొంక మార్గంలోకి నీరు చేరింది. అటుగా వెళుతున్న నరియానాయక్ ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. కొద్ది దూరం కొట్టుకుపోయి విగతజీవిగా పడి ఉన్న నరి యానాయక్‌ను గుర్తించిన పరిసర ప్రాంత రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. నరియానాయక్ మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. నరియానాయక్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బుడ్డోనితండాకు వెళ్లి నరియానాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ముగిసిన తిరునక్షత్రోత్సవాలు


లక్ష్మీనరసింహస్వామి, ఆళ్వారులను మాడవీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మనవాళ మహాముని తిరున క్షత్రోత్సవాలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు మం గళవారం స్వామివారు, ఆళ్వారులకు తిరువీధిలో పుణప్పాట్టు సేవ అర్చకులు చేపట్టి ప్రబంధ పాశురాలను పఠిస్తూ మాడవీధుల్లో ఊరే గించారు. ఈ ఉత్సవాల్లో దేవస్థాన అర్చకులు, పండితులు, ప్రబంధ పారాయణాదారులు, ఆలయ అనువంశిక ధర్మకర్త పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో వేద మంత్ర పఠనాలతో పంచామృ తాభిషేకం చేసిన అర్చకులు 1001 తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్థిని రామ లింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్దతిలో కొనసాగాయి. పాత గుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 14,42,089ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

సిమెంట్ పరిశ్రమ రద్దు చేయించిన తర్వాతే

సీఎం జిల్లాలో అడుగుపెట్టాలి

● నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


పెద్దకాపర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాలరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కాలుష్యంతో హాని కలిగించేలా రామన్నపేట శివారులో ఏర్పాటు చేసే సిమెంట్ పరిశ్రమను రద్దు చేయించిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగుపెట్టాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమ వల్ల ఆయా ప్రాంతాల్లో విపరీతమైన కాలుష్యం వెదజల్లుతుందని ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు వేలాది మంది రైతులు పరిశ్రమతో వ్యవసాయ సాగును కోల్పోతారని, భూముల విలువ కూడా తగ్గుతుందని భూములున్న వారు పెద్దఎత్తున నష్టపోతారన్నారు. ప్రజాకాంక్ష మేరకు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ కోసం ఈ నెల 8న సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో పాదయాత్ర చేపట్టి పర్యటించనున్నారని సిమెంటు పరిశ్రమను రద్దు చేయించాకే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగుపెట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లను మరిచారని విమర్శించారు. ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రామన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ఏర్పాటు చేయబోయే కాలుష్య కారక సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేసినట్లు ప్రకటించిన తర్వాతనే యాదాద్రి జిల్లాలో సీఎం పర్యటించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అలంకారంగా ప్రారంభించారు. తప్పా ఇప్పటి వరకు కొనుగోలు జరగడం లేదన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తానంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి చేటుగా మారనున్న సిమెంట్ ఫ్యాక్టరీని కూడా రద్దు చేయాలని అన్నారు. లేని పక్షంలో సీఎం మూసీ యాత్రను అడ్డుకుంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

సూర్యాపేటరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యు వకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని రాయినిగూడెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం ద్వారకుంట గ్రామానికి చెందిన షేక్ ఫిరోజ్, శివవరప్రసాద్ కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని రాయినిగూడెం సమీపంలోకి రాగానే ధాన్యం లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. యువకులకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సూచన మేరకు ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు.

(3వ పేజీ తరువాయి)

సర్వేకు సర్వం సిద్ధం

30 నుంచి 40 నిమిషాల సమయం పట్టనుంది. కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్లకు ఇచ్చిన ట్యాబ్‌లో నమోదు చేసి సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. సర్వే కోసం ఎన్యూమరేటర్లు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు సంబంధిత ఇంటి సభ్యులు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తే ఎన్యూమరేటర్లు మరోసారి తిరిగి ఆ ఇంటిని సందర్శించి వివరాలు నమోదు చేస్తారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లా ప్రజలు సహకరించాలి. సర్వే విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దు. సర్వేలో కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ నేపథ్యంతో పాటు మరికొన్ని అంశాలను సేకరించనున్నారు. సర్వే నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు వాస్తవాలు తెలపాలి.

● తేజస్‌నందలాల్ పవార్, కలెక్టర్

పెంచికల్‌దిన్నె పశువైద్యాధికారిగా నరేష్



నేరేడుచర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామ పశువైద్యాధికారిగా జంపాల నరేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రవినాయక్ గరిడేపల్లి మండల పశువైద్యాధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ పశుపెంపకందారులకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.

చేతి పంపులు పనిచేసేదెలా?





అర్వపల్లిలో నేలకు ఒరిగిన చేతి పంపు, అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిరుపయోగంగా చేతిపంపు

అర్వపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మంచినీరు అందించే చేతి పంపులు చాలావరకు నిరుపయోగం మారాయి. జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండలంలో 280చేతి పంపులు ఉండేవి. బోరు బావులు, మిషన్ భగీరథ నీరు రావడంతో క్రమక్రమంగా చేతి పంపులు కనమరుగవుతున్నాయి. అర్వపల్లి మండల కేంద్రంలో మాత్రం ఎస్సీ బాలుర వసతి గృహం ఎదుట 30ఏళ్ల క్రితం వేసిన చేతి పంపు రోడ్డు అంచున ఉంది. మీ సేవ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న చేతి పంపు భూమికి అనుకుని ఉంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చేతి పంపు నిరుపయోగంగా ఉంది. చేతి పంపులను ఎత్తులో అమర్చితే నీటిని వినియోగించుకుంటున్నామని స్థానికులు తెలిపారు. చేతి పంపులు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వీటికి త్వరలో మరమ్మతు చేయిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు.

దారులు ఇలా? వెళ్లేది ఎలా?



అధ్వానంగా ఉన్న నాగులపాటి అన్నారం - లింగాల రోడ్డు

పెన్‌పహాడ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు శిథిలావస్థకు చేరాయి. వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. లింగాల గ్రామం నుంచి నాగులపాటి అన్నారం వరకు, దాచారం నుంచి నాగులపాటి అన్నారం వరకు, మాచారం నుంచి పొట్లపహాడ్ వరకు, తంగెళ్లగూడెం నుంచి చీదెళ్ల గ్రామం వరకు, ధర్మాపురం నుంచి రంగయ్యగూడెం మెట్టుబండ వరకు అడుగడుగునా గుంతలు పడ్డాయి. జానారెడ్డినగర్ నుంచి దూపాడు గ్రామ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా

మండలంలో రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయని ప్రజలు చెబుతున్నారు. ఈ అంశంపై నివేదిక రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తాం.

● వెంకటేశ్వర్‌రావు,ఎంపీడీవో, పెన్‌పహాడ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మార్కెట్లలో అవినీతికి తావు ఇవ్వం

జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్‌కుమార్



జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌లలో అవినీతికి అవకాశం ఇవ్వమని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి సంతోష్‌కుమార్ అన్నారు. జిల్లాలోని ఐదు మార్కెట్‌ల ద్వారా ఈ ఏడాది రూ. 18.95 కోట్లు ఆదాయం వచ్చేలా టార్గెట్ ఉందని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.

● ఆంధ్రజ్యోతి, భానుపురి

ఆంధ్రజ్యోతి: "జిల్లాలో ఎన్ని మార్కెట్‌లకు ధాన్యం వస్తోంది?

అధికారి: సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్‌లకు మాత్రమే ధాన్యం వస్తోంది. సన్నాలు హెచ్ఎంటీ, బీపీటీ, జైశ్రీరాం, స్వర్ణమసూరి, ఆర్ఎన్ఆర్, దొడ్డురకం ఐఆర్ 64 రకం మాత్రమే వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: మార్కెట్‌లలో రైతులకు సౌకర్యాలు కల్పిస్తున్నారా..

అధికారి: సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్లల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మార్కెట్ గోదాంల ద్వారా ఆదాయం వస్తుందా?

అధికారి: జిల్లాలో 13 గోదాములు ఉన్నాయి. సూర్యాపేట మార్కెట్‌లో ఉన్న గోదాములలో ఈవీఎంలు, సివిల్ సప్లయ్ బస్తాలు ఉన్నాయి. జిల్లాలో 13500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే కెపాసిటీ ఉంది.

ఆంధ్రజ్యోతి: జిల్లాలోని ఏఏ మార్కెట్‌కు టార్గెట్ ఉంది?

అధికారి: సూర్యాపేట మార్కెట్‌కు 5.75 కోట్ల మార్కెట్ ఫీజు, కోదాడకు 4.25 కోట్లు, హుజూర్‌నగర్‌కు 4.25 కోట్లు, తిరుమలగిరికి 2.50 కోట్లు, నేరేడుచర్లకు 1.70 కోట్లు ,తుంగతుర్తికి 50 లక్షలు టార్గెట్ ఉంది. నేరేడుచర్ల, హుజూర్‌నగర్, తుంగుతర్తి మార్కెట్‌లు చెక్‌పోస్టులపై ఆధారపడి నడుస్తోంది.

ఆంధ్రజ్యోతి: మార్కెట్ ధాన్యం ఎక్కడికెక్కడి వెళ్తుంది..

అధికారి: మార్కెట్‌లో ధాన్యం మిల్లర్లు, ట్రేడర్లు కొనుగోలు చేస్తారు. మిల్లులకు వెళతుంది.

హుజూర్‌నగర్ మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం సెలవుపై వెళ్లగా, ఆయన స్థానంలో యాకోబ్ పాషా బాధ్యతలు స్వీకరించారు. యాకోబ్ పాషా నేరేడుచర్లకు బదిలీ కాగా, శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు అభినందించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా శ్రీనివాస్

తుంగతుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల మహాసభలో శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లు నాగార్జునరెడ్డి, యాదగిరి, కోట గోపి, లక్ష్మి, సత్యం, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పశుగర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం పట్ల మంచి స్పందన వస్తుందని జిల్లా శిబిరం సహాయ సంచాలకులు డాక్టర్ బి. వెంకన్న, జిల్లా పశుగణ అబివృద్ది సంస్థ అదికారి డాక్టర్ రాజశేఖర్‌లు తెలిపారు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసిన సందర్బంగ వారు పాల్గొని మాట్లాడారు. ఈశిబిరంలో 185 పశుశులకు టీకాలు వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ అనంతుల వెంకన్న, డాక్టర్ యర్రంశెట్టి కిరణ్, డాక్టర్ శ్రీకాంత్, గోపాల మిత్రలు లింగయ్య, సైదులు, వెంకన్న, మహబూబ్‌అలీ, నగేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి



గోరెంట్ల గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిరసన తెలుపుతున్న దళితులు

మద్దిరాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని గోరెంట్ల గ్రామానికి చెందిన దళితులు డిమాండ్ చేశారు. మంగళవారం గోరెంట్ల గ్రామ శివారులోని సర్వే నెం. 423లో 3ఎకరాల 20గుంటల భూమిని ఆక్రమించుకుని నిరసన తెలిపారు. ఈ సందర్బంగా పలువురు దళితులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వ భూమిలో పశువులు, మేకలు మేపేవాళ్లమన్నారు. ఈ భూమిలోని కొంతభాగంలో గత ప్రభుత్వం డంపింగ్ యార్డును ఏర్పాటు చేసిందన్నారు. తహసీల్దార్ రాంప్రసాద్, వీఆర్వో మాతంగి వెంకన్న సహకారంతో పోలుమళ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు హర్షవర్దన్‌రెడ్డి ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. దళితులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్బంగా పోలీసులు, దళితుల మధ్య వాగ్వివాదం జరిగింది. దళితులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎస్ఐ వీరన్న మాట్లాడుతూ ఈ భూమిపై సర్వే చేయించి న్యాయం చేస్తామని,ఉత్తర్వులు వచ్చే వరకు ఎవరూ ఆ భూమి వైపు వెళ్లొద్దని దళితులను ఆదేశించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్వాయి పరశురాములు, వెంకటేశ్వర్లు, మైసయ్య, లతీఫ్, శ్రీకాంత్, లింగయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి



మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్

హుజూర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకునేంత వరకు పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, మునిసిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం పట్టణంలో మునిసిపల్ చైర్మన్ గెల్లి అర్చనరవి, కమిషనర్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఆరేళ్ల నుంచి పనిచేస్తున్న చెత్త బండ్ల డ్రైవర్లను తొలగించడం సరికాదని, వారికి జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, శేఖర్, సాయి, సోమయ్య, శోభన్, కనకారావు, చారి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న చందర్‌రావు

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని కాపాడుకుందామని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి చందర్‌రావు కోరారు. పీడీఎస్‌యూ నిర్మాత జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్ వర్ధంతి సందర్బంగా మంగళవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ 1970 ప్రాంతంలో దేశంలో నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం పేదరికం ఎక్కువగా ఉందన్నారు. ఆ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి యూనివర్సిటీ విద్యార్థులు ముందుకు వచ్చారన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు జార్జిరెడ్డిని మతోన్మాద శక్తులు హతమార్చిన తర్వాత ఆయన బాటలో జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్ నడిచారన్నారు. చంద్రఖరప్రసాద్‌ను ఆనాటి కేంద్ర ప్రభుత్వం 1975 నవంబరు ఐదో తేదీన ఇల్లెందు చీకటిగండ్ల వద్ద కాల్చి చంపిందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై పీడీఎస్‌యూ 50ఏళ్లుగా పోరాటాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాఖీ, సంతోష్, జంపన్న, విజయ్, గౌతమ్, అభి, నగేష్, మల్లేష్ పాల్గొన్నారు.

వెంకన్నయాదవ్‌కు సన్మానం

తుంగతుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడిగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌ను మంగళవారం ఆయన నివాసంలో తుంగతుర్తి యువజన కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్బంగా యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లభించిందని అన్నారు. సన్మానించిన వారిలో తెలంగాణ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ రాజు, నాయకులు కొమ్ము జోహార్, నరేష్‌గౌడ్, రామడుగు నవీన్, నరేష్, లింగన్న, నవీన్, అబ్బుల్, శ్రీకాంత్‌గౌడ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ నేతగా శ్రీనివాస్

అర్వపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి నియోజకవర్గ టీఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన గంగదర్ శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు శ్రీనివాస్‌కు. నియామకపత్రాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ అందజేశారు. టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సూరారపు సైదులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, పరమేశ్వర్, ఆకారపు శ్రీను, సైదులు, దేవరకొండ నర్సయ్య, సూరారపు రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లుఅధికంగా కేటాయించాలి

నాగారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి మొదటి విడతలో 100 ఇందిరమ్మ ఇళ్లు నాగారం గ్రామం కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్‌లో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రైతు వేదిక భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, మండల కార్యాలయాలు నాగారంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై మంత్రి వెంకట్‌రెడ్డి సానుకులంగా స్పందించారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కన్నెబోయిన వెంకటబిక్షం, గ్రామ శాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ, అనంతుల వెంకటయ్య, యాదగిరి, బాలగాని మురళి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'చెకుముకి' సంబురాలు

నేరేడుచర్ల, కోదాడ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీ నుంచి నిర్వహించే 'చెకుముకి' సైన్స్ సంబురాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు సుంకరి క్రాంతికుమార్, శ్రీరాములు తెలిపారు. మంగళవారం నేరేడుచర్ల మండల వనరుల కేంద్రం వద్ద 'చెకుముకి' సైన్స్ సంబురాల పోస్టర్‌ను ఎంఈవో సత్యనారాయణరెడ్డితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. . కార్యక్రమంలో ప్రతాప్, శ్రీనివాసరెడ్డి, నాగేందర్ పాల్గొన్నారు.

● కోదాడలోని ఎస్వీ హైస్కూల్‌లో 'చెకుముకి' పోటీల వాల్ పోస్టర్‌ను జన విజ్ఞాన వేదిక కోదాడ డివిజన్ చెకుముకి కోఆర్డినేటర్ డీఎస్ స్వామి, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు, బి.సైదులు, చెకుముకి కోదాడ మండల కన్వీనర్ ఎం.జానకిరామ్ ఆవిష్కరించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కోదాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో సలీం షరీఫ్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హాజీంబాబా అన్నారు. మంగళవారం మండలంలోని కొమరబండ శివారులోని తేజ విద్యాలయంలో 68వ ఎస్‌జీఎఫ్ కోదాడ నియోజకవర్గ స్థాయి అండర్-17, 14 బాల బాలికల ఖోఖో పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి కోదాడకు పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉస్తెల రమాసోమిరెడ్డి, క్రీడా కన్వీనర్ కొండల్, ప్రకాష్, సీతారాంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయి అండర్-14, అండర్-17 ఖోఖో బాలబాలికల పోటీల్లో సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని రాయినిగూడెం సమీపంలో ఉన్న శాస్త్ర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. పాఠశాలకు చెందిన బానుతేజ, విక్రమ్ ఉత్తమ ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల చైర్మన్ మైనం చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు.

సొంత ఖర్చుతో పారిశుధ్య పనులు

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగడ్డమాచవరం గ్రామంలోని శ్రీరామాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో కంపచెట్లు పెరిగి భక్తులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆ గ్రామానికి చెందిన రైతు మాడుగుల పరశురాం మంగళవారం రూ.10వేల వ్యయంతో ఎక్స్‌కవేటర్‌తో పారిశుధ్య పనులు చేయించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పాఠశాల ఆవరణలో మొరం పోయించి చదును చేయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మీగడ కోటయ్య, ఆవుల సైదులు, చిమ్మట పెద్దసైదులు, మట్టపల్లి, గురవయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి సహకరించాలి

సూర్యాపేట అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం శబరిమల నారాయణతోడ్ సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప మాలధారుల అన్నదాన భవన నిర్మాణం కోసం భక్తులు సహకరించాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాసు కోరారు. మంగళవారం సూర్యాపేటలోని శబరినగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి శబరిమలైకి వచ్చే అయ్యప్ప మాలధారులు సేదదీరేలా గదులు నిర్మాణం, నిత్యా న్నదానం కోసం సొంత భవనం నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బేతి తిర్మల్‌రావు, రాచర్ల రమేష్, శంకర్ చౌదరి, భాస్కరాచారి, రంగు ముత్యంరాజు, నరేష్, శ్రీనివాస్,

సర్వారం పీఏసీఎస్‌లో ఆగిన అవిశ్వాసం

గరిడేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వారం ప్రాథమిక సహకార సంఘంలో చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డిపై అవిశ్వాస తీర్మానం ఆగింది. అవిశ్వాస తీర్మానం ఈ నెల ఐదో తేదీన నిర్వహిస్తామని జిల్లా సహకార అధికారి గత నెల 19న సంఘంలోని 13 మంది డైరక్టర్లకు, సంఘం పరిధిలో ఉన్న అన్ని పంచాయతీ కార్యాలయాలకు నోటీసులు అందించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేస్తూ జిల్లా అధికారిమధ్యాహ్నం 12 గంటలకు నోటీసులు పంపారు. సాధారణంగా వాయిదా పడితే కనీసం ఒక రోజు ముందు నోటీసు ఇవ్వాలి. 11 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేస్తూ 12 గంటలకు నోటీసులు పంపడం పలు అనుమానాలకు దారి తీసింది.

ఈ విషయమై చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీకి డీసీవోఒ కొమ్ము కాస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన అవిశ్వాస తీర్మానాన్ని బుధవారానికి వాయిదా వేస్తూ మధ్యాహ్నం 12 గంటలకు నోటీసు పంపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలకు డీ సీవో కొమ్ముకాస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడటం సరికాదని ఆయన అన్నారు.

అత్యవసర పనులతో హాజరుకాలేదు

అత్యవసర పనులు ఉన్నందున కార్యాలయ్యానికి మంగళవారం హాజరుకాలేదు. సహకార సంఘాల చట్టం పరిధిలోని 1996 సెక్షన్ 34 ఏ (5) ప్రకారం సమావేశానికి అధ్యక్షత వహించడానికి రిజిస్ట్రార్‌కు వీలు కాని పక్షంలో ఆ కారణాలను లిఖిత పూర్వకంగా రికార్డు చేసి సమావేశాన్ని మరుసటి రోజుకు వాయిదా వేయవచ్చు. అదే విధానాన్ని నేను పాటించా.

● పద్మ, డీసీవో



సూర్యాపేట టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో పార్టీ జెండాను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలోకారింగుల వెంకన్న, ఎర్ర అఖిల్‌కుమార్, పాల్గొన్నారు.

● బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కుల గణనలో విశ్వ బ్రాహ్మణులను విశ్వ కర్మలను ఒకే కులస్థులుగా గుర్తించాలని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ, విశ్వ కర్మ మాత్య సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు.

సూర్యాపేటఅర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పద్మశాలీలు నమోదు చేసుకోవాలని పద్మశాలీ సంఘం తెలంగాణ ప్రాంత కన్వీనర్ మిట్టకోల సతీష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆసంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆత్మకూర్(ఎస్) నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 17వ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్ఎంల ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని మండల నాయకురాలు సల్వాది నిర్మల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు డి.వెంకటరమణ, రేణుక, రాములమ్మ, సంధ్య పాల్గొన్నారు

పెన్‌పహాడ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల గ్రామంలో ఈనెల 8వ తేదీన జరిగే సీపీఎం మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం లింగాల గ్రామంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. . కార్యక్రమంలో రణపంగి కృష్ణ, శ్రీకాంత్‌వర్మ, రవి పాల్గొన్నారు.

● వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ధరావత్ లాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు.. కార్యక్రమంలో చిలకరాజుశ్రీను, నర్సయ్య, జయంత్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని మాలమహానాడు సంఘం రాష్ట్ర నాయకులు దగ్గుపాటి బాబూరావు, ఇట్టిమళ్ల శ్రీనివాస్, లచ్చిమళ్ల నర్సింహారావు కోరారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మంగళవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా పీవీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రాములు, పుల్లయ్య, జ్ఞానయ్య, కోటమ్మ, సావిత్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

గరిడేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో ఈ నెల 17న నిర్వహించే సెంకడ్ ఏఎన్ఎంల రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు మెటికల కవిత కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. . ఈ కార్యక్రమంలో విజయ, రాజకుమారి, సైదమ్మ పాల్గొన్నారు.

మోతె, నవంబరు 5 (ఆంధ్రప్రదేశ్): ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు దామళ్ల కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, నర్సయ్య, గోవర్దన్‌రెడ్డి, ఎల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావును మంగళవారం మండలంలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అన్నెం నరసింహారెడ్డి, అన్నెం పాపిరెడ్డి, సంజీవరెడ్డి, కొప్పుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుపాకుల రామయ్య, అమరబోయిన యలమంద తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంలకు వ్యతిరేకంగా కవి దాశరథి పోరాడారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దాశరథి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాములుగౌడ్, సంతోష్, దుర్గయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని విమర్శించే స్థాయి చిరుమర్తి లింగయ్యకు లేదని మండలంలోని మిర్యాల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ గోరుగంటి రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం మిర్యాల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో కాస శంకర్‌యాదవ్, మెంచు లింగమల్లు, రాచకొండ ఎల్లయ్య, వేల్పుల రఘు, అనంతుల మధు పాల్గొన్నారు.

మద్దిరాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఎన్నికల అధికారి రేపాల లింగయ్య తెలిపారు. మండల అధ్యక్షుడిగా జి.రాములు, ఉపాధ్యక్షులుగా బి.శిల్పా, ఎండీ అలీం, ఎస్.నగేష్, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా ఏ.విజయ్, పి.సురేష్, జి.శివప్రసాద్, ఎ.జ్వాల, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్.లింగయ్య, కె.మధు, బి.శ్రీనివాస్, ఆడిట్ కన్వీనర్‌గా కె.ఉమేష్, కె.శిరీషను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కె.మధు, లింగయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని తొండ గ్రామ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వి.వెంకటేశ్వర్లు అన్నారు. చెరుకు లక్ష్మి, సుధాకర్‌ల మనుమరాలు సినయన పుట్టినరోజు సందర్బంగా హంస ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, జామెట్రీ బాక్సులను మంగళవారం అందజేసిన సందర్బంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హంస ఫౌండేషన్ బాధ్యులు పొరెళ్ల విప్లవ్ కుమార్, నీరటి ప్రవీణ్, ఓ.వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల బారినపడకుండా వైద్యసిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని నాగారం పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. మాదక ద్రవ్యాల నిషేధంపై మంగళవారం నాగారం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు , వైద్య సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, కొకైన్ వినియోగించే యువతను ఆశా కార్యకర్తలు గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో బిచ్చునాయక్, హెచ్ఈ విమలమ్మ, అరుణకుమారి, సూపర్‌వైజర్ రామచంద్ర, వినోద పాల్గొన్నారు.